JAYABHERIDAILY.COM
తెలుగు దినపత్రిక
ప్రభాత
# జయభేరి
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
మేడ్చల్ - మల్కాజిగిరి | ఆదివారం 05-10-2025
Medchal - Malkajgiri | Sunday 05-10-2025
jayabherinews
సంపుటి : 02 | సంచిక : 129 | పేజీలు : 8 | వెల : 5
Vol. 02 | Issue 129 | Pages : 8 | ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889
call me
jayabheripaper@gmail.com




## ఆటో డ్రైవర్ల ఖాతాల్లో 15వేలు జమ

### ఆటోల్లో ప్రయాణించిన చంద్రబాబు, పవన్, లోకేష్

**ఆంధ్రప్రదేశ్‌లో ఆటో డ్రైవర్లకు పండగ రోజు. వారి ఖాతాల్లో ప్రభుత్వం 15 వేలు జమ చేసింది. ఈ కార్యక్రమాన్ని విజయవాడలో ప్రారంభించింది ప్రభుత్వం. వేడుకలో ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. జిల్లాల్లో మంత్రులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.**


జయభేరి, విజయవాడ, అక్టోబరు 4:

ఈ పథకాన్ని ప్రారంభించిన తర్వాత బహిరంగ సభలో నేతలు మాట్లాడారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లకు ఆర్థిక సాయం చేయడమే కాకుండా వారి బాగోగుల కోసం ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించారు. విజయవాడలోని సింగ్‌నగర్‌లోని మానినేని బసవపున్నయ్య స్టేడియండో ఆటో డ్రైవర్ సేవలో కార్యక్రమం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్, ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షుడు మాధవ్ ఆటోలో ప్రయాణించారు. డ్రైవర్లతో మాట్లాడి వారి కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. సీఎన్జీ, ఎలక్ట్రిక్ ఆటోలతో కలిగే లాభం గురించి ...మిగతాది 2 లో

## ఆపరేషన్ కొండాపూర్

### కొండపూర్లో దాదాపు రూ. 3600కోట్ల ప్రభుత్వ భూమిని కాపాడిన హైడ్రా
### 36 ఎకరాల ప్రభుత్వ భూమిలో ఆక్రమణలు తొగించిన హైడ్రా





**రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలంలోని కొండాపూర్లో దాదాపు రూ.3600 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని హైడ్రా కాపాడింది. కొండాపూర్ ఆర్టీఏ కార్యాలయానికి సమీపంలోని సర్వే నంబర్ 59లో 36 ఎకరాల ప్రభుత్వ భూమిని ఉంది. ఆ భూమిని కొంతమంది కబ్జా చేశారు. ఈ విషయమై హై కోర్టు తీర్పు మేరకు శనివారం ఆక్రమణల తొలగింపును హైడ్రా చేపట్టింది. అందులో తాత్కాలిక షెడ్డులను ఏర్పాటు చేసి వ్యాపారం చేసుకుంటున్న వారిని ఖాళీ చేయించిన హైడ్రా. భారీ బందోబస్తు మధ్య అక్కడ షెడ్డులను తొలగించిన హైడ్రా. ప్రభుత్వ భూమి చుట్టూ కంచె వేసి ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ బోర్డులు పెట్టారు.**

జయభేరి, హైదరాబాద్, అక్టోబరు 4:

హైదరాబాద్ మహానగరంలో ప్రభుత్వ భూముల ఆక్రమణలు, కబ్జాలకు గురైన భూములను రక్షించే ప్రక్రియను హైడ్రా విజయవంతంగా చేస్తోంది. హైడ్రా అధికారులు చేపడుతున్న కఠిన చర్యలు మరోసారి చర్చనీయాంశమయ్యాయి. రంగారెడ్డి జిల్లా, శేరిలింగంపల్లి మండలంలోని కొండాపూర్‌లో ఏకంగా రూ.3,600 కోట్ల విలువైన 36 ఎకరాలను హైడ్రా అధికారులు రక్షించారు. ప్రభుత్వ భూమిని కాపాడేందుకు 'హైడ్రా' సంస్థ భారీ ఎత్తున కూల్చివేతల ఆపరేషన్ చేపట్టింది. ఈ కూల్చివేతలు కేవలం ప్రభుత్వ ఆస్తిని రక్షించడం మాత్రమే కాకుండా, భూ కబ్జాదారులకు బలమైన హెచ్చరికగా నిలిచాయి.ఆర్టీఏ కార్యాలయం పక్కనే ఉన్న భిక్షపతి నగర్ ఏరియాలో ఆపరేషన్ కొండాపూర్ హైడ్రా చేపట్టింది. సర్వే నంబర్ 59లో ఉన్న ఈ 36 ఎకరాల ప్రభుత్వ స్థలంలో కొంతమంది వ్యక్తులు ఆక్రమించారు. తాత్కాలిక నిర్మాణాలు చేపట్టారు. వ్యాపార కార్యకలాపాలు చేపట్టారు. దీనిపై హైడ్రాకు అనేక ఫిర్యాదులు వచ్చారు. ఈ ఫిర్యాదులతో కదలిన అధికారులు చర్యలకు ఉపక్రమించారు. పకడ్బందీగా ఆక్రమణలు తొలగించారు. దీనిపై హైకోర్టులో కేసు నడుస్తోంది. అయితే ఈ విచారణలో భాగంగా ఆక్రమణలు తొలగించాలని అధికారులను హైకోర్టు ఆదేశించింది. హైకోర్టు ఆదేశాల మేరకు హైడ్రా సిబ్బంది ఈ ఆక్రమణల తొలగింపును అత్యంత పకడ్బందీగా చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేందుకు, ఆ ప్రాంతంలో భారీ ...మిగతాది 2 లో




## టిమ్స్ పాలిటిక్స్

- బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్
- కేసీఆర్ మీద కక్షతో ఆసుపత్రులపై పగ
- వందేళ్ల ముందు చూపు కేసీఆర్ ది

జయభేరి, హైదరాబాద్, అక్టోబరు 4:

ఆరోగ్య రంగంలో తెలంగాణను నిర్వీర్యం చేశారని ప్రభుత్వంపై హరీష్ రావు విరుచుకుపడ్డారు. ఎల్బీనగర్‌లో టిమ్స్ ఆస్పత్రి నిర్మాణాన్ని హరీష్ రావు పరిశీలించారు. వరంగల్ హెల్త్ సిటీ, టిమ్స్ ఆసుపత్రుల పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని.. కేసీఆర్ హయాంలో ప్రారంభమైన నిర్మాణం ఇంకా సాగుతోందన్నారు. లేదంటే ప్రజల నుంచి తిరుగుబాటు తప్పదని రేవంత్ రెడ్డిని హెచ్చరించారు. వందేళ్ల ముందు చూపు కేసీఆర్ ది అయితే, మంద బుద్ధి కాంగ్రెస్ పార్టీదన్నారు. రెండేళ్లుగా టిమ్స్ ఆసుపత్రులను పడావు పెట్టారని.. కేసీఆర్ మీద కక్షతో ఆసుపత్రులపై పగ పెంచుకోవడం దారుణమన్నారు. కరోనా తర్వాత వందేళ్ల ముందు చూపుతో హైద్రాబాద్ చుట్టూ నలువైపులా నాలుగు టిమ్స్ ఆసుపత్రులు నిర్మించాలని కేసీఆర్ తలపెట్టారని.. టిమ్స్ లతో పాటు, నిమ్స్ రెండు వేల పడకల ఆసుపత్రి నిర్మించాలని శంకుస్థాపన చేశారన్నారు. గతంలో అనేక ...మిగతాది 2 లో



## మాట్లాడటానికి ఇంకేం లేదు..

### మావోయిస్టులు లొంగిపోవాల్సిందే : అమిత్ షా

- జయభేరి, న్యూ డిల్లీ, అక్టోబర్ 4:

కేంద్రం ప్రభుత్వ ఒత్తిడి నేపథ్యంలో ఆయుధాలు వదిలేసి చర్చలకు వచ్చే విషయంలో మావోయిస్టులలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఈ వ్యవహారంపై కీలక వ్యాఖ్యలు చేశారు. మావోయిస్టులతో ఇక ప్రభుత్వం ఎలాంటి చర్చలు జరపదని, వాళ్లు ఆయుధాలు వదిలేసి లొంగిపోవాల్సిందేనని వ్యాఖ్యానించారు. లొంగిపోయేందుకు మావోయిస్టులు ముందుకు వస్తే తాము స్వాగతిస్తామని హోంమంత్రి అన్నారు. లొంగిపోయిన వారందరికీ ప్రభుత్వం నుంచి అందాల్సిన వివిధ ప్రయోజనాలు అందిస్తామని, పునరావాసం కల్పిస్తామని హామీ ఇచ్చారు. బస్తర్ జిల్లాలో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడిన హోంమంత్రి.. 2026 మార్చి 31 నాటికి దేశం మావోయిస్టు రహితంగా మారుతుందని చెప్పారు. తమతో చర్చలు జరపాలని మావోయిస్టులు ప్రభుత్వాన్ని కోరుతున్నారని.. ఇప్పుడు వారితో మాట్లాడడానికి ఏముందని హోంమంత్రి వ్యాఖ్యానించారు. బస్తర్ అంతటా ఉన్న మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నాయన్నారు. ఈ ప్రాంతంలో ఆయుధాలతో శాంతికి విఘాతం కలిగించే వారికి భద్రతాదళాలు తగిన సమాధానం ఇస్తాయని ఆయన హెచ్చరించారు.

## ఇక ఉద్యోగాలే.. ఉద్యోగాలు



- డీఎస్సీ, గ్రూప్-1, గ్రూప్-1, గ్రూప్-3 నోటిఫికేషన్లు
- ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు జాబ్ క్యాలెండర్
- న్యాయపరమైన అడ్డంకులు రాకుండా జాగ్రత్తలు
- నిరుద్యోగులకు మేలు జరుగుతుందని ప్రభుత్వం
- దాదాపు 30వేలకుపైగా ఖాలీలతో క్యాలెండర్ విడుదల అయ్యే ఛాన్స్

జయభేరి, హైదరాబాద్, అక్టోబరు 4:

తెలంగాణలో నిరుద్యోగులకు గుడ్ న్యూస్ చెప్పేందుకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగ క్యాలెండర్ ప్రకటించేందుకు సిద్ధమైంది. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కొన్ని నియామకాలను రేవంత్ సర్కార్ చేపట్టింది. డీఎస్సీ, గ్రూప్ 1, గ్రూప్ 1, గ్రూప్ 3 నోటిఫికేషన్లు వేసింది. అయితే ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు జాబ్ క్యాలెండర్ ఎప్పుడిస్తారని ప్రతిపక్షాలతోపాటు నిరుద్యోగ యువత ప్రశ్నిస్తోంది. ఈ మధ్య కాలంలో నిరుద్యోగులు ఆందోళనలు కూడా చేపట్టారు. అన్ని వైపుల నుంచి వస్తున్న ఒత్తిడి, లోకల్ బాడీ ఎన్నికలు, ఇతర ...మిగతాది 2 లో

## ఓటు బ్యాంకును తేల్చనున్న స్థానిక ఎన్నికలు

జయభేరి, హైదరాబాద్, అక్టోబరు 4 :

స్థానిక ఎన్నికల సమరానికి ప్రధాన పార్టీలు తెరవెనుక కసరత్తులు వేగవంతం చేశాయి. పదునైన వ్యూహాలతో స్థానిక ఎన్నికల బరిలో సత్తా చాటేందుకు సిద్ధమయ్యాయి. అయితే ఈసారి ఎన్నికలు కాస్త వైవిధ్యంగా కనిపిస్తున్నాయి. బీసీలకు 42శాతం రిజర్వేషన్లతో ప్రజాక్షేత్రంలోకి అధికార కాంగ్రెస్ అడుగుపెడుతోంది. మీరెంతో.. మీకంత.. అంటూ బిసిలను ఐక్యం చేసి, గంపగుత్తగా ఓట్లు సాధించే ప్రయత్నాలు గట్టిగానే చేస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే అసెంబ్లీలో బిసి రిజర్వేషన్ బిల్లుకు ఆమోదం, ...మిగతాది 2 లో




## నాయకుడే నయవంచకుడైతే..?!

...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## ఆపరేషన్ కొండాపూర్

పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారుపూర్తి బందోబస్తుతో ఆపరేషన్ చేపట్టిన అధికారులు ఆ ప్రాంతంలోకి ఎవరినీ అనుమతించలేదు. దాదాపు రెండు కిలోమీటర్ల పరిధిలో కారిడార్లు ఏర్పాటు చేశారు. స్థానికులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నారు. తాత్కాలికంగా ఏర్పాటు చేసిన షెడ్లను తొలగించారు. అది ప్రభుత్వ భూమి అని చెప్పే బోర్డులు ఏర్పాటు చేశారు. చుట్టూ కంచెను ఏర్పాటు చేశారు. కొండాపూర్ ప్రాంతం హైదరాబాద్ నగరంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న, అత్యంత విలువైన స్థిరాస్తి మార్కెట్‌లలో ఒకటి. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, సర్వే నంబర్ 59లోని ఈ 36 ఎకరాల ప్రభుత్వ భూమి విలువ దాదాపు రూ. 3,600 కోట్లు ఉంటుందని అంచనా. హైడ్రా చేపట్టిన ఈ ఆక్రమణల తొలగింపులో మరో కోణం వెలుగు చూసింది. తమ భూములు గత 60 ఏళ్లుగా తమ అధీనంలోనే ఉన్నాయని కొంతమంది రైతులు చెబుతున్నారు. భూమిని ఆక్రమించుకున్న కొందరు వ్యక్తులు, వ్యాపారం చేసుకుంటున్న వారు, తాత్కాలిక షెడ్లు వేసుకున్న వారు కాకుండా, ఈ భూమిపై తమకు హక్కు ఉందని రైతులు చెబుతున్నారు. అధికారులు హైకోర్టు తీర్పు మేరకు చర్యలు చేపట్టినప్పటికీ, రైతుల 60 ఏళ్ల అధీనంపై ఉన్న వాదన చట్టపరమైన సవాళ్లకు దారి తీసే అవకాశం ఉంది. అయితే, ఈ ఆక్రమణ తొలగింపు చర్య హైకోర్టు ఆదేశాల మేరకు జరగడంతో, ప్రభుత్వపరంగా పాలనాపరమైన చర్యలు వేగంగా పూర్తయ్యాయి. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత హైదరాబాద్‌లో భూ వివాదాల పరిష్కారం, ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు అధిక ప్రాధాన్యత ఇచ్చేందుకు హైడ్రాను పటిష్ఠం చేసింది. ఎన్ని వివాదాలు, సమస్యలు వచ్చినా ముందుకెళ్లేలా చర్యలు తీసుకున్నారు.

## ఇక ఉద్యోగాలే.. ఉద్యోగాలు

కారణాలతో జాబ్ క్యాలెండర్ ప్రకటించేందుకు సిద్ధమైంది. తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ ముగిసింది. పెండింగ్‌లో ఉన్న కొన్ని పోస్టుల భర్తీ కూడా జరిగిపోయింది. న్యాయపరమైన అడ్డంకులు రాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. అందుకే ఇకపై జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తే నిరుద్యోగులకు మేలు జరుగుతుందని ప్రభుత్వం ఆలోచిస్తోంది. ఇప్పుడు నోటిఫికేషన్ క్యాలెండర్ విడుదల చేస్తే ఎలాంటి న్యాయపరమైన చిక్కులు ఉండబోవని ఖాళీలు కూడా భారీగా ఉంటాయని చూస్తోంది. దాదాపు 30వేలకుపైగా ఖాళీలతో క్యాలెండర్ విడుదల అయ్యే ఛాన్స్ ఉందని అధికారులు చెబుతున్నారు. ఇందులో ఇరవై వేలకుపైగా ఉద్యోగాలకు ఆర్థిక శాఖ అనుమతి కూడా లభించినట్టు తెలుస్తోంది. మిగతా వాటికి అనుమతి వచ్చిన వెంటనే వాటితో క్యాలెండర్ విడుదల కానుంది. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే అరవై వేలకుపైగా ఉద్యోగాలను భర్తీ చేసింది. ఇందులో ఉపాధ్యాయ, పోలీస్, వైద్య, విద్యుత్ శాఖలో ఉద్యోగాలు ఉన్నాయి. టీజీపీఎస్సీ ద్వారా కూడా నియామకాలు జరిపింది. ఇందులో గ్రూప్ 3 మినహా మిగతా ఉద్యోగాల భర్తీ ప్రక్రియ పూర్తి అయ్యింది. వాటిని కూడా త్వరలోనే పూర్తి చేయాలని తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కసరత్తు చేస్తోంది. గ్రూప్1, గ్రూప్2 నియామక ప్రక్రియ పూర్తి అయిన తర్వాత దీన్ని చేపట్టనుంది. ఈ మూడు పరీక్షలను కామన్‌గా చాలా మంది అభ్యర్థులు రాసి ఉంటారు. అన్నింటిలో ఉత్తీర్ణత సాధించి ఉంటారు. అందుకే ముందు గ్రూప్1, తర్వాత గ్రూప్ 2, అనంతరం గ్రూప్3 నియామకాలు చేపడితే అభ్యర్థులు స్థాయి రీత్యా పోస్టులు ఎంపిక చేసుకుంటారు. అలా చేయకుంటే గ్రూప్3 ఉద్యోగంలో జాయిన్ అయిన వ్యక్తికి గ్రూప్ 1 వస్తే ఆ ఉద్యోగాన్ని వదిలేస్తాడు. దీని వల్ల ఆ పోస్టు ఖాళీ అవుతుంది. అలా కాకుండా ముందే గ్రూప్1 భర్తీ ప్రక్రియ చేపడితే అందులో ఉద్యోగాలు రాని వ్యక్తి గ్రూప్2 లేదా గ్రూప్3 వచ్చి ఉంటే అందులో జాయిన్ అవుతారు. సుదీర్ఘ కాలం పెండింగ్‌లో ఉన్న ఖాళీల భర్తీ ప్రక్రియ ఇప్పటికే ముగిసింది. ఇప్పుడు కొత్తగా ఏర్పడ్డ ఖాళీలను సేకరిస్తున్నారు. ఆయా శాఖల నుంచి వివరాలు తీసుకుంటున్నారు. వాటి ఆధారంగా ఆర్థిక శాఖ అనుమతులు పొందేందుకు కసరత్తు జరుగుతోంది. ఇప్పటికే 20 వేల ఉద్యోగాలకు ఆర్థిక శాఖ అనుమతి ఉంది. మరికొన్ని పోస్టులకు కూడా అనుమతి పొందిన తర్వాత అన్నింటిని క్యాలెండర్‌లో యాడ్ చేస్తారు. ఎప్పుడు ఏ నెలలో ఏ ఉద్యోగాలు భర్తీ చేయనున్నారో ఎన్ని రోజుల్లో నియామక ప్రక్రియ పూర్తి అవుతుందో ఆ క్యాలెండర్‌లో వివరంగా చెబుతారు. దీంతో నిరుద్యోగులు ప్రిపరేషన్ సులభమవుతుంది. ప్రభుత్వంలో ఉన్న ఖాళీలు, క్యాలెండర్‌లో పెట్టాల్సిన పోస్టులపై ప్రత్యేక కమిటీ కసరత్తు చేస్తోంది. ప్రక్రియను వీలైన త్వరగా పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తోంది. వివిధ కారణాలతో కొందరు ఉద్యోగాల్లో చేరకపోవడంతో ఆ పోస్టులు బ్యాక్‌లాగ్‌లో పడ్డాయి. అలాంటి ఉద్యోగాలు నాలుగు వేల వరకు ఉన్నాయి. ఇందులో గురుకుల నియామక బోర్డు పరిధిలోనే సగం ఉన్నాయి. ఇవి కాకుండా టీజీపీఎస్సీ ద్వారా చేపట్టిన నియామకాల్లో కూడా వంద వరకు బ్యాక్‌లాగ్ పోస్టులు ఉన్నాయి. ఇవి కాకుండా ఇప్పటికే వివిధ విభాగాల్లో ఖాళీలు గుర్తించారు. ఆర్టీసీ, మెడికల్ విభాగాల్లో పదివేలు, 12వేలకుపైగా పోలీసు శాఖలో ఉద్యోగాలు ఖాళీలు ఉన్నాయి. అన్నింటికి ఆర్థిక శాఖ అనుమతి ఇస్తే త్వరలోనే నిరుద్యోగులకు ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పనుందని అధికారులు చెబుతున్నారు.

## టిమ్స్ పాలిటిక్స్

ప్రభుత్వాలు పని చేసినా నిజాం కాలంలో కట్టిన గాంధీ, ఉస్మానియా, కింగ్ కోఠి ఆసుపత్రులే ఉన్నాయని.. అందుకే పనులు ప్రారంభించిన కేసీఆర్ దాదాపుగా పూర్తి చేశారన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పనులు ముందుకు పోవడం లేదు.. భూసేకరణ, టెండర్లు, డిజైన్లు పూర్తి చేసింది, నిధులు ఇచ్చింది... సెల్లార్‌తో కలుపుకొని 6 అంతస్తుల భవనం ఎల్బీ నగర్ టిమ్స్ పనులను బిఆర్ఎస్ పూర్తి చేసింది. కానీ అప్పటి నుండి రెండేళ్లలో 5 అంతస్తులు మాత్రమే పూర్తి చేశారని విమర్శించారు. బిఆర్ఎస్ ప్రభుత్వం ఉండి ఉంటే ఆసుపత్రి పనులు ప్రారంభమై, ప్రజలకు సేవలు అందించేదన్నారు. మేము మహేశ్వరం నియోజకవర్గంలో రంగారెడ్డి జిల్లా మెడికల్ కాలేజీ శాంక్షన్ చేస్తే, జీవో జారీ చేస్తే, దాన్ని రద్దు చేసారు. శంకుస్థాపన చేసిన కాలేజీని రద్దు చేసి, టిమ్స్ ఎల్బీ నగర్ లో విలీనం చేశారన్నారు. వరంగల్ హెల్త్ సిటీ, హైదరాబాద్ టిమ్స్ ఆసుపత్రులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. బస్తీ దవాఖానలను ఆపేశారని.. జూబ్లీహిల్స్ ప్రజలకు ఏం చెబుతారని సీఎం రేవంత్ రెడ్డిని హరీష్‌రావు ప్రశ్నించారు. కేసీఆర్ కిట్లు, న్యూట్రీషన్ కిట్లు, బతుకమ్మ చీరెలు ఆపేశారు.. కేసీఆర్ ప్రారంభించిన పథకాలను ఆపడం తప్ప, మీరు చేస్తున్నదేం లేదన్నారు.

## ఓటు బ్యాంకును తేల్చనున్న ఎన్నికలు

తరువాత గవర్నర్ గ్రీన్ సిగ్నల్, అక్కడి నుండి రాష్ట్రపతి వద్ద వెయిటింగ్ వరకూ కాంగ్రెస్ పాచిక చేరింది. ఇప్పుడు బంతి రాష్ట్రపతి కోర్టులో ఉంది. ఇలా మాాదేం తప్పులేదు, మేము బిసిలకు చేయాల్సిందంతా చేస్తున్నాం, అడ్డుపడుతున్నది బిజేపినే అంటూ బిసిలకు బిజేపిని దూరం చేసే ప్రయత్నం చేస్తోందనేది పొలిటికల్ టాక్. అంతేకాదు బిసిలకు 42శాతం రిజర్వేషన్ల ఆధారంగా స్థానిక ఎన్నికల్లో సీట్లు కేటాయిస్తూ గెజిట్ కూడా విడుదల చేసింది. తెలంగాణ వ్యాప్తంగా 31 జిల్లాల్లో, 565 మండలాల్లో స్థానిక ఎన్నికలు జరగబోతున్నాయి. కొత్త రిజర్వేషన్ల కేటాయింపు తరువాత ఏ కులాలకు తాజాగా సీటు కేటాయింపులు ఎలా ఉన్నాయంటే.. ప్రధానంగా జెడ్పీ చైర్ పర్సన్ తాజా లెక్కలు పరిశీలిస్తే బీసీలకు 41.93శాతం , ఎస్సీలకు 19.35, ఎస్టీలకు 12.90 , ఓసీలకు 25.80 శాతం సీట్లు కాటాయించింది. జిల్లాల వారీగా రిజర్వేషన్లు చూస్తే ఖమ్మ జిల్లా జడ్పీ చైర్మెన్ ఎస్టీ అభ్యర్థికి, ములుగు జడ్జీ చైర్మెన్ ఎస్టీ మహిళకు కేటాయించారు. నల్గొండ జడ్పీ చైర్ పర్సన్ ఎస్టీ మహిళకు, వరంగల్ ఎస్టీ, హన్మకొండ, జనగామ జడ్పీలు ఎస్సీ మహిళకు కేటాయించారు. జోగులాంబ గద్వాల్, రాజన్న సిరిసిల్ల, రంగారెడ్డి జిల్లాల జెడ్పీ చైర్ పర్సన్ పదవులు ఎస్సీ మహిళ, సంగారెడ్డి ఎస్సీ కోటా, జయశకంకర్ భూపాలపల్లి, కరీంనగర్, కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలు బిసి అభ్యర్థులకు కేటాయించారు. నిర్మల్, నిజామాబాద్, సిద్దిపేట, సూర్యాపేట, వికారాబాద్ జడ్జీలు బీసిలకు కేటాయించారు.మహబూబ్ నగర్ , మంచిర్యాల, నాగర్ కర్నూల్, వనపర్తి, యాదాద్రి భువనగిరి జడ్పీలు బీసీ మహిళ ఇచ్చారు. ఆదిలాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, నారాయణపేట జడ్పీలు ఓసీ మహిళ కేటాయించారు. భద్రాద్రి కొత్తగూడెం, కామారెడ్డి, మహబూబాబాద్ , మెదక్ జడ్పీలు ఓసీ జనరల్ కు ఇచ్చారు. ఇలా స్థానిక ఎన్నికల్లో కీలకంగా మారిన జెడ్పీ చైర్ పర్సన్ స్థానాలో మీరెంతో, మీకంత అనే రూల్ ఫాలో అయ్యింది అధికార కాంగ్రెస్ ప్రభుత్వం.
రాబోతున్న స్థానిక సంస్థల ఎన్నికలే తెలంగాణలో అన్ని పార్టీలకు ఆయువుపట్టులాంటివి. స్థానికంగా బలమైన కేడర్ ను ఏర్పాటు చేసుకోవడంతోపాటు, సర్పంచ్ లు, ఎంపీటీసిలు, జెడ్ పీటీసీలలో ఎక్కువ సీట్లు దక్కించుకోవడం ద్వారా ఓటు బ్యాంక్ ను మరింత బలోపేతం చేసుకోవడానికి ఈ ఎన్నికలే సరైన అవకాశం. ఈ ఎన్నికల్లో గెలుపు లెక్కల ఆధారంగానే మరో మూడేళ్ల తరువాత అసెంబ్లీ, పార్లమెంట్ ఫలితాలు ఆధారపడి ఉంటాయి. గత పదేళ్లు అధికారంలో లేకపోవడంతో కాంగ్రెస్ కు క్యాడర్ దూరమైయయింది. కేవలం కాంగ్రెస్ విధేయులు మాత్రమే పార్టీలో ఉన్నారు. ఈ ఎన్నికల్లో సాధ్యమైనంత ఎక్కువ మంది ప్రజాప్రనిధులు కాంగ్రెస్ నుండి గెలిస్తే వారితో వచ్చే క్యాడర్ పార్టీకి బలంగా మారుతుందని అంచానా వేస్తోంది.

# నాయకుడే నయవంచకుడైతే..?!

**బుద్ధిజాన్ని చాటుతూ అంబేద్కర్ రాజ్యాంగాన్ని అడ్డం పెట్టుకొని దుర్మార్గ పనికి వడిగట్టిన వారిని కచ్చితంగా చట్టపరంగా శిక్షించాల్సిందే... కానీ జరుగుతున్నది ఏంటి...!? మనువాదులకు నోర్లు వస్తున్నాయి...!? దళిత సంఘాలు నోర్లు మూతపడ్డాయి..!? గాయత్రి చదువుల తల్లట కాళికామాత రక్షణ మంత్రట దుర్గామాత ప్రధానమంత్రట.. మనువాదుల నిర్వచనాలు చూస్తే దిమ్మతిరిగి పోవాల్సిందే... మీ దళితులు అందుకే వెనుకబడ్డారా ?అన్న ప్రశ్నలు దళిత సమాజాన్ని వెక్కిరిస్తున్నాయి..!? చదువుకున్న విజ్ఞత కలిగిన వారే వెంట్రుక కూడా పీకలేరు? అంటే దళిత సంఘాలకు కనీసం ఆ... రెండు లెవ్వన్నట్టా..!?**



✍ కడారి శ్రీనివాస్
సీనియర్ జర్నలిస్ట్ (జయభేరి),
తెలంగాణ రాష్ట్ర ఉత్తమ ఎడిటోరియల్ జర్నలిస్ట్ అవార్డు గ్రహీత, కవి, గాయకుడు, రచయిత, సామాజిక ఉద్యమకారులు

✍ జయభేరి, హైదరాబాద్ :

తెలంగాణ రాష్ట్రంలో దళితులకు అన్యాయం జరిగితే అయ్యో.. అంటూ ముసలి కన్నీరు కార్చే వాళ్లే.. రోజురోజుకు ఎక్కువైపోతున్నారు! అంతటితో ఆగరు పురాణాల్లో వేదాల్లో గాయత్రి చదువుల మినిస్టర్ కాలిక మాత డిఫెన్స్ మినిస్టర్ దుర్గామాత ప్రైమ్ మినిస్టర్ అంటూ ఊకదంపుడు ఉపన్యాసాలతో హిందువుల మనోభావాలను నెత్తిన పెట్టుకొని కీర్తిస్తూ, హిందూ సమాజంపై విరుచుకుపడే దళిత సంఘాలకు సవాల్ విసిరింది కౌన్సిలింగ్ చేసే ప్రియా చౌదరి మేడం.. తను మాట్లాడిన మాటలు ఆడపిల్లగా దళిత అమ్మాయికి అన్యాయం జరిగింది. ఆ విషయంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. అవసరమైతే ఉరిశిక్ష కూడా వేయాలి. దళిత సంఘాలు ఏం చేస్తున్నాయి? అని మాట్లాడితే బాగుండు. కానీ కంచే చేను మేస్తే అని మొదలెట్టిన ఈ పెద్దావిడ దళిత జాతికి మొత్తం ఈ దుర్మార్గుడు అధిపత!? బుద్ధిజానికి మొత్తం తానే తోపా? బాబా సాహెబ్ అంబేద్కర్ భావజాలాన్ని ప్రకటించేవాడు వీడొక్కడేనా? ఈ విషయాన్ని క్లారిటీగా చెప్పాలి... తప్పు చేసిన వ్యక్తిని వ్యక్తిగతంగా మాట్లాడుతూ అతని చట్టానికి అప్పజెప్పే లాగున చర్యలు తీసుకోవాలి, అవసరమైతే లీగల్ గా ఈ సమస్యను ముందుకు తీసుకెళ్లాలి. ఇవేవీ చేయని ప్రియా చౌదరి ఏకంగా ఎస్సీ పదాన్ని అడ్డం పెట్టుకున్న దరిద్రులు అట్రాసిటీ కేసులు పెట్టిన దుర్మార్గులు... అంటూ తన మనసులో మాటను బయటపెట్టారు. హిందూయిజం మీద, గోబ్యాక్ మార్వాడి అంటూ మీ గొంతులను అరిచి గోల చేసి రాష్ట్రాన్ని ఊపి కదిపేసారు కదా? ఇప్పుడు ఈ అమ్మాయి విషయంలో ఎన్ నైన్ మీడియా అధిపతిగా చెప్పుకుంటున్న (ఆ పేరు చెప్పడానికి కూడా నా మనసు రావట్లేదు..) ఆ రాక్షసుడిపై నయవంచకుడి పై ఎందుకు చర్య తీసుకోవట్లేదు. అని సూటిగా ఈ సమాజాన్ని ప్రశ్నిస్తే సరిపోయేది. కానీ తాను హిందూ ధర్మాన్ని మనువాదాన్ని మూటగట్టుకుని నెత్తిన పెట్టుకొని మన దళిత సమాజాన్ని వెక్కిరించి జరిగిన తప్పును పదేపదే వర్ణిస్తూ విప్పి చెప్పడం మొత్తానికి దళిత సమాజాన్ని వెక్కిరించినట్టు కాదా? హిందూ సాంప్రదాయంలో ఇలాంటివి జరగలేదా? ప్రవచనాకారులు ఇలాంటి కామ క్రోధానికి దూరంగా ఉన్నారా? అంటే సమస్యను చిన్నచూపు చూసినట్టు అయిపోతుందో ఏమో! కానీ, కచ్చితంగా ఆడపిల్లను క్షుద్ర పూజల పేరుతో నానా విధాలుగా శారీరక హింస చేసిన ఈ రాక్షసుడిని చట్టపరంగా శిక్షించాల్సిందే.. దళిత సంఘాలు దళిత జాతిలో ఉన్న ఎమ్మెల్యేలు మంత్రులు ముందుకు రావాలి. ఇక ఆయా యూట్యూబ్లో సోషల్ మీడియాలో దళిత జాతి, దళిత కుటుంబం దళితులు... అన్న పదాన్ని ఆనాడు అంబేద్కర్ ఒప్పుకోలేదు. కానీ మన అమ్మాయికి అన్యాయం జరిగింది. అని కచ్చితంగా వాటిపై గొంతు లేపుతున్న ఎంతోమంది షెడ్యూల్ క్యాస్ట్ కు చెందిన జర్నలిస్టులు సోషల్ మీడియాలో బయట ఈ ఉదంతాన్ని ఖండిస్తూ వస్తున్న... పాపం ప్రియా చౌదరికి కనిపిస్తలేదేమో.?

**దళిత జాతికి మొత్తం ఈ దుర్మార్గుడే అధిపత? అన్నట్టుగా మాట్లాడుతోంది. ప్రతి జాతిలో దుర్మార్గులు ఉంటారు. ప్రతి జాతిలో నీచ నికృష్ట అష్ట దౌర్భాగ్య కామ పిచాచులు ఉంటారు. పాపం ఈవిడ గారికి హిందూ ధర్మంలో దేవతలు శక్తి మాతలే కనిపిస్తున్నాయో ఏమోగానీ దళితులను రాక్షసులుగా చేసిన చరిత్రలు తనకు తెలియదా..!? వెంట్రుక కూడా పీకలేరు ? అని ఏ ధర్మశాస్త్రం చెప్పిందో తనకే తెలియాలి. ఒకే ఒక్క అంశాన్ని పట్టుకొని ఏకంగా ఎస్సీ, అట్రాసిటీ కేసును నీరుగార్చే విధంగా తాను మాట్లాడడం మొత్తానికి యావత్ దళిత సంఘాలను చెంప చెల్లుమనిపించేలా ఘాటు వ్యాఖ్యలు చేశారు. నిజమే ఎన్ 9 మీడియా అధినేత, క్షుద్ర పూజల పేరుతో నమ్మకద్రోహంతో కన్న బిడ్డతో సమానం అని ఆలోచించకుండా తండ్రి స్థానంలో ఉన్న కామంధుడు అమ్మాయిని అత్యాచారం జరపడం, అమ్మాయి తండ్రి పోలీస్ కంప్లైంట్ చేయడం, దీనిపై మీడియా నాకు సహాయం చేయండి? అనే అర్థించడం! ప్రపంచం మొత్తం చూసింది. ఈ విషయంలో కన్న తండ్రి ఆ కామాంధుడికి ఫోన్ చేసి మాట్లాడడం మనమందరం విన్నాం. పోలీసులు జీరో ఎఫ్ ఐ ఆర్ చేసి ఫోక్సో కేసును నమోదు కూడా చేశారు. కేసు ఇన్వెస్టిగేషన్లో ముందుకు సాగుతోంది. కానీ నేరం ఆరోపింపబడిన ఈ కామాంధుడు మాత్రం కనిపించకుండా పోయాడు. ఎవ్వరైనా దొరికే వరకే... దొరకనంతసేపు ఎవ్వరైనా నాయకులే, రాజకీయ ఉద్దండులే, మత ప్రచారకులే... హిందూ మతంలోనూ బాబాల పేరుతో ప్రవచన కారుల పేరుతో ఎంతమందిని అత్యాచారం చేయలేదు. క్రైస్తవ సమాజంలో ఎంత మంది దుర్మార్గపు పాస్టర్లు!? ఆరోజున ప్రియా చౌదరి ఇలాగే మాట్లాడారా!? హిందూ ధర్మం మీద హిందూ ధర్మాన్ని ప్రశ్నించారా? దళిత జాతికి అన్యాయం జరిగిన మాట వాస్తవమే! కానీ ఆ కేసును ఆ దాడికి పాల్పడిన దుర్మార్గుడిని చీల్చి చెండాడాలే కానీ ఈ కేసును పక్కదారి పట్టించేలా దళిత జాతినీ ,ఎస్సీ అట్రాసిటీ కేసుని , దళితులను దరిద్రులు దుర్మార్గులు అంటూ ఈ పదం అడ్డం పెట్టుకొని ఎవరిని ఏం చేశారో తాను చెప్పాల్సిన అవసరం ఉంది!?**

ఈ సమాజానికి చదువు నేర్పింది జ్యోతిబాపూలే..
ఈ సమాజానికి పోరాటం నేర్పింది పెరియార్..
ఈ సమాజాన్ని అంటరానితనం నుండి బయటికి నడిపించి మహిళలకు హక్కులను కల్పించింది బాబా సాహెబ్ అంబేద్కర్..! అంతేకానీ ప్రియా చౌదరి చెప్పినట్టుగా హిందూ ధర్మశాస్త్రము మనువాదమో లేదంటే గాయత్రి అమ్మవారో కాలిక మాత, దుర్గామాత... ఇలా దేవి దేవతలు వచ్చి మాకు హక్కులు గాని విధులు గాని బాధ్యతలు గాని చదువు గాని బోధించలేదు..!?
దళిత జాతికి అన్యాయం జరిగిన మాట వాస్తవం.
దళిత మైనర్ బాలికపై అత్యాచారానికి వడిగట్టిన రాక్షసుడిని శిక్షించాల్సిన అవసరం అత్యవసరం ఎంతైనా ఉంది. ఇదే విషయాన్ని అడ్డం పెట్టుకొని గోవా మార్వాడి ఉద్యమాన్ని గురించి మాట్లాడడం కుల మత విద్వేషాలను రెచ్చగొట్టడం, హిందూ దేవతల పేర్లను ప్రస్తావించడం దేనికి సంకేతం? జాతిని వేలెత్తి చూపించడమే...! అన్ని కులాల్లో అన్ని మతాల్లో అన్ని సాంప్రదాయాల్లో చీడపురుగులు ఉన్నమాట వాస్తవం. ఇలా చెప్పుకుంటూ పోతే పెంటను పెకిలిస్తే గాజులు పెంకాసులు, రాళ్లు రప్పలే బయటపడతాయి. అంతేకానీ మనులు మాణిక్యాలు బయటపడవు..? వేదాలు వేరు. వేదాలు సరియైన సమాచారాన్ని బోధిస్తున్న, పురాణాలు తమకిష్టం వచ్చినట్టుగా రాసుకున్న చరిత్రలు ప్రియా చౌదరి గారికి తెలియవేమో..!? అయినా దళిత మైనర్ బాలికకు అన్యాయం జరిగిన విషయం పైనే మాట్లాడకుండా ఇలా మనువాదాన్ని హిందూ అనే పదాన్ని తీసుకురావడం ఆమె వివేకానికే వదిలేద్దాం... ఎస్సీ అట్రాసిటీ కేసు ఎలా వచ్చింది? ఎందుకు వచ్చింది? దేనికోసం వచ్చింది ? అనే విషయం తెలియద.? దాన్ని అడ్డం పెట్టుకుని ఎంత దుర్మార్గానికి పాల్పడుతున్న దరిద్రులు ఎవరు దళితుల..? సమస్య తీరు తెన్నులు వివరిస్తూనే తమ జాతిని తమ కులాన్ని తమ మతాన్ని చాలా చక్కగా వివరించు కుందావిడ.. ఇప్పటికైనా దళిత సంఘాల్లార, అంబేద్కర్ వాదులారా, ఏకంకండి..! మనలో తప్పు జరిగినప్పుడు మనమే బొంద తీసి పాతేరేయాలి. అంతేకానీ మనవాదులు రెచ్చిపోతే మన ఉనికిని మనమే పాడు చేసుకున్న వాళ్ళం అవుతాం. మైనర్ బాలికపై అఘాయిత్యానికి తెగబడ్డ ఇలాంటి క్షుద్ర పూజలు చేసే నరరూప రాక్షసుడిని సమాజంలో తిరగనీయకుండా యావజ్జీవ కారాగారా శిక్ష పడేలాగా అడ్వకేట్లు ముందుకు రావాలి. మైనర్ బాలికకు న్యాయం జరిగేలా చూడాలి. అన్ని దళిత సంఘాలు ముక్తకంఠంతో ఈ సంఘటనాన్ని ఖండించాలి.. ఇలాంటి దుర్మార్గులు సమాజంలో ఉండకూడదు. కానీ ఈ సాకును అడ్డం పెట్టుకొని యావత్ దళిత జాతిని నోటికొచ్చినట్టు మాట్లాడిన మాటలు ఈ సమాజం మరచిపోకూడదు. పోరాటంలో, యుద్ధంలో ఆఖరికి ప్రతి సంఘటనలోనూ మా బతుకులు ఎప్పుడు ప్రాణార్పణ చేసే మల్లయోధులమే... అంతేకానీ మీలా ఊకదంపుడు ఉపన్యాసాలు దేవి దేవతలకు అధికారాలు కట్టబెట్టడం మాకు చేతకాదు. ఏ మతాన్ని ఏ కులాన్ని ఈ ఉదంతం లోకి తీసుకురాకూడదు.
మా పుట్టుకే పోరాటం. మా బ్రతుకే నిత్యం నరకం. తప్పు చేసిన వాడు పాలోడైన ఖచ్చితంగా బొంద పెడతాం... తెలంగాణ మహాకవి కాలోజీ సాక్షిగా ఈ దుర్మార్గుడికి శిక్ష పడేలాగున యావత్ దళిత సంఘాలు ఏకమై ఈ దుర్మార్గుడిని చట్టానికి అందించాల్సిన బాధ్యత ఉంది.

## ఆటో డ్రైవర్ల ఖాతాల్లో 15వేలు

ఆటో డ్రైవర్ల వివరించారు. డబ్బులు ఖాతాలో పడ్డాయో లేవో చూసుకోవాలని డ్రైవర్లను ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. డబ్బులు పడితే సెల్ ఫోన్లల్లో వచ్చిన బ్యాంక్ మెసేజీలను చూపించిన సూచించారు. ఆటో డ్రైవర్ల కోసం ఉబర్ తరహా యాప్ తెస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. కూటమి పాలనలో ప్రజల కష్టాలు తీరుతున్నాయని సంక్షేమం ఇంటికి చేరుతోందని పేర్కొన్నారు. " ఆటో డ్రైవర్ల కోసం ఒక యాప్ తయారు చేసి బుకింగ్ లు వచ్చేలా చేస్తాం. ఆటో స్టాండుకు వెళ్లి పడిగాపులు పడే అవసరం లేకుండా టెక్నాలజీ ద్వారా సహకారం అందిస్తాం. ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఆటో డ్రైవర్ల భవిష్యత్తు కోసం పనిచేస్తాం. ఒక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి యాప్ ద్వారా మీకు అవకాశాలు దొరికేలా చేస్తాం.ఆటో, మాక్సి క్యాబ్, క్యాబ్ డ్రైవర్లందరికీ కూటమి ప్రభుత్వం అండగా ఉంటుంది. మీకు మంచి చేసిన కూటమి ప్రభుత్వం గురించి పది మందికి చెప్పండి. ప్రజలంతా ఆనందంగా ఉండటమే కూటమికి కావాల్సింది. ఆటో డ్రైవర్ల సేవలో పథకం ద్వారా ఆర్థిక సాయం డ్రైవర్ల ఖాతాల్లో పడ్డాయి. ఆటో డ్రైవర్ల సేవలో కార్యక్రమం ద్వారా ఇవాళ ఆటో డ్రైవర్లు, మాక్సీ క్యాబ్, క్యాబ్ డ్రైవర్లకు పండుగ. గతంలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. డబ్బులన్నీ రిపేర్లకే సరిపోయేవి... జరిమానాలు కూడా వేసి వేధించారు.2024లో జరిగిన ఎన్నికలు నా జీవితంలో ఎప్పుడూ చూడలేదు. 94 శాతం స్ట్రైక్ రేట్ వచ్చింది. ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలతో ఈ స్ట్రైక్ రేట్ ఇంకా పెరగాలి. 16 నెలల క్రితం వ్యవస్థలన్నీ నిర్వీర్యం అయ్యాయి. పాలన ఎక్కడికక్కడ ఆగిపోయింది." అని అన్నారు"2,90,669 మంది డ్రైవర్ల ఖాతాల్లోకి రూ.436 కోట్లు జమ చేశాం. ఏ ఒక్కరికి డబ్బులు జమ కాకపోయినా రిపోర్టు చేస్తే అర్హతను బట్టి ఖాతాలో వేస్తాం. స్త్రీశక్తి పథకం ద్వారా కూటమి ప్రభుత్వం మహిళలకు స్వేచ్ఛ ఇచ్చింది. ఆటో డ్రైవర్ కుటుంబంతో కలిసి వేదిక వరకూ వచ్చాను. వారి కుటుంబం కష్ట సుఖాలను తెలుసుకున్నాను. గత పాలకులు అస్సలు పట్టించుకోకపోవటంతో రోడ్లన్నీ గుంతలు పడ్డాయి. రాష్ట్రంలో 23 వేల కిలోమీటర్ల మేర మరమ్మతులు చేసి గుంతలు లేని రోడ్లను తయారు చేశాం. అన్నా క్యాంటీన్లలో రూ.5కే ఆహారం పెడుతున్నాం. మధ్యాహ్నం పిల్లలకు సన్న బియ్యంతో భోజనం పెడుతున్నాం. పేదల ఆకలి తీర్చే అన్నా క్యాంటీన్లను కూడా గత పాలకులు నడవనీయలేదు. విజయవాడలో 90 శాతం వాహనాలు సీఎన్జీ ఇంధనంతోనే నడుస్తున్నాయి. వచ్చే రోజుల్లో అన్నీ ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చేలా ప్రణాళికలు చేస్తున్నాం. గతంలో పెద్ద ఎత్తున జరిమానాలు విధించేవారు... జరిమానాలు భారంగా కాకుండా చూస్తాం." అని చంద్రబాబు మాట ఇచ్చారు. అంతే కాకుండా డ్రైవర్లు కూడా క్రమశిక్షణతో వ్యవరించాలని సూచించారు. ప్రభుత్వానికి, ప్రజలకు సహకరించాలని రాష్ట్రాభివద్ధికి తోడ్పడటాలని హితవులు పలికారు. "ఆటో, మాక్సి, క్యాబ్ డ్రైవర్లు క్రమశిక్షణగా ఉండాలి. ఎక్కడా నిబంధనలు ఉల్లంఘించవద్దు... ఎక్కడికక్కడ సీసీ కెమెరాలు ఉంటాయి. క్రమశిక్షణగా ఉండి, ప్రజలకు సౌకర్యం కల్పించండి. తద్వారా పర్యాటక రంగం అభివృద్ధి చెందుతుంది. ఆటోలను దశలవారీగా ఈవీలుగా మార్చేందుకు ప్రభుత్వం సహకరిస్తుంది. రాష్ట్ర పునర్నిర్మాణం, సుపరిపాలను కేవలం 16 నెలల్లోనే తెచ్చాం. యూనివర్సల్ హెల్త్ పాలసీ ద్వారా రాష్ట్రంలో అందరికీ ఉచిత ఆరోగ్య భీమా కల్పించాం. 25 లక్షల వరకూ పేదలకు ఉచిత వైద్య సేవలు అందుతాయి. కేంద్రం అమలు చేసిన జీఎస్టీ సంస్కరణల వల్ల ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుంది." అని అన్నారు. " మన సంస్కృతిలో భాగమైన పండుగల్ని అంతే ఉత్సాహంతో చేసుకోవాలి. 16 నెలల క్రితం వరకూ పరదాలు కట్టుకుని, గోతులు తవ్వారు. ప్రజల్ని భయంలో ఉంచారు. రాష్ట్రాన్ని విధ్వంసం చేశారు. పేదల సంక్షేమంలోనూ డబ్బులు బొక్కేసిన వాళ్లు రాజకీయానికి పనికిరారు. ఇలాంటి దుష్టశక్తులు రాకుండా, ప్రజలకు చెడు జరక్కుండా కాపాడుకోవాలి. అదే మనకు ఈ దసరా, దీపావళి పండుగల పాఠాలు. మనకు ఇక ఈ వైకుంఠపాళి వద్దు. ఆ దుష్టులు మళ్లీ వస్తే అన్నీ పీకేస్తాడు. అందుకే అలాంటి వారి పాలన మనకు వద్దు. డబుల్ ఇంజిన్ సర్కారుతోనే కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ అభివృద్ధి సాధ్యమవుతుంది" అని చంద్రబాబు తెలిపారు.

**ఆటో డ్రైవర్లకు 15 వేలు**

మహిళలకు ఆర్టీసీల్లో ఉచిత బస్ ప్రయాణ పథకం వల్ల ఆటో డ్రైవర్లకు గిరాకీ తగ్గిందని ప్రభుత్వం భావిస్తోంది. అందుకే ఆ లోటును కూటమి ప్రభుత్వం భరించేందుకు సిద్ధమైంది. వారికి ఏటా పదిహేను వేల రూపాయలు ఆర్థిక సాయం చేసింది.కూటమి ప్రభుత్వం వచ్చిన ఆర్థిక వెసులుబాటు చూసుకొని ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ వస్తోంది. ఇప్పటికే సూపర్ సిక్స్ పేరుతో ఇచ్చిన హామీలను చాలా వరకు అమలులోకి తీసుకొచ్చింది. ఆటో డ్రైవర్లకి కూడా ఆర్థిక సాయం చేస్తామని ఎన్నికల్లో హామీ ఇవ్వకపోయినా దాన్ని ఇప్పుడు అమలులోకి తీసుకొచ్చింది. రాష్ట్రంలోని సొంత ఆటో రిక్షా, మోటార్ క్యాబ్, మ్యాక్సీ క్యాబ్ కలిగ ఉన్న డ్రైవర్లకు మాత్రమే పదిహేను వేల ఆర్థిక సాయం చేయనున్నారు. ఆటో డ్రైవర్ సేవలో అని పేరుతో దీన్ని ఇవాళ ప్రారంభించనుంది. విజయవాడ సెంట్రల్ నియోజవర్గ పరిధిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ పథకాన్ని 11 గంటలకు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ ఏపీ బీజేపీ అధ్యక్షుడు మాధవ్ పాల్గొంటారు. ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఉన్న 2, 90, 669 మంది ఈ పథకానికి అర్హులుగా ప్రభుత్వం తేల్చింది. వారి ఖాతాల్లో436 కోట్ల రూపాయలు జమ చేశారు. వైసీపీ హయాంలో కూడా వాహన మిత్ర పేరుతో ఆటో డ్రైవర్లకు ఆర్థిక సాయం చేశారు. వారికి ఏటా పది వేల రూపాయలు అందజేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం దాన్ని పదిహేను వేలకు పెంచింది. ఇప్పుడు లబ్ధి పొందుతున్న వారిలో ఆటో డ్రైవర్లు 2,25,621 మంది, త్రీవీలర్స్ వాహనాలు కలిగిన డ్రైవర్లు 38,576 మంది, మోటార్ క్యాబ్ డ్రైవర్లు 20,072, మ్యాక్సీ క్యాబ్ నడిపే డ్రైవర్లు 6,400 మంది ఉన్నారు. ఎక్కువ మంది లబ్ధిదారులు విశాఖ పట్నంలో ఉన్నారు. అక్కడ 22, 355 మంది లబ్ధిదారులు ఉన్నారు. అర్హులను నేరుగా ప్రభుత్వం దరఖాస్తు చేసుకోమని సూచించింది. సచివాలయ సిబ్బంది, ఇతర మార్గాల్లో లక్షల మంది దరఖాస్తులు పంపించారు. వారిలో అన్ని పత్రాలు సరిగా ఉన్న అర్హులను మాత్రమే ఈ పథకానికి ఎంపిక చేసింది. ఈ ప్రక్రియలో పొరపాటును నిజమైన అర్హులకు లబ్ధి పొందకపోయినా , లేకుంటా అనర్హులకు లబ్ధి పొందినా ఫిర్యాదు చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. లబ్ధిదారులు ఆంధ్రప్రదేశ్ పౌరుడై ఉండి, డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ కలిగి ఉండి, సొంత వాహనం ఉన్న వాళ్లు మాత్రమే అర్హులు అవుతారు. అలాంటి వ్యక్తులు మాత్రమే అప్లై చేసుకోవడానికి అర్హులు.

**ఆగస్టులో హామీ అక్టోబర్‌లో అమలు**

కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో ఆటో సేవ అనేది లేదు. కానీ ఆగస్టు 15న మహిళలకు ఉచిత బస్ ప్రయాణ పథకం స్త్రీ శక్తి ప్రారంభ సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆటో డ్రైవర్లకు తగిన న్యాయం చేస్తామని మాట ఇచ్చారు. అందుకు తగ్గట్టుగానే సెప్టెంబర్‌లో ఈ విషయాన్ని ప్రకటించారు. అర్హులైన ఆటో డ్రైవర్లకు దసరా నుంచి 15వేలు ఇస్తామని పేర్కొన్నారు. అందుకు తగ్గట్టుగానే పథకాన్ని అక్టోబర్ నాలుగో తేదీ నుంచి ప్రారంభించారు. గతంలో ఇచ్చిన దాని కంటే యాభై శాతం ఎక్కువ ఆర్థిక సాయం చేస్తున్నట్టు వెల్లడించారు. వాహనదారులకు మేలు చేసేందుకు రాష్ట్రంలోని రోడ్లను రిపేర్ చేసింది. గత ప్రభుత్వం వేసిన గ్రీన్ టాక్స్‌ను భారీగా తగ్గించింది. గతంలో ఇరవై వేల వరకు గ్రీన్ ట్యాక్స్ చెల్లించాల్సి వచ్చేది. దాన్ని మూడు వేల రూపాయలకు తగ్గించింది. ఇప్పుడు ఆటో సేవ పేరుతో పదిహేను వేల రూపాయలు జమ చేస్తోంది.

# రాబోవు కాలమంతా.. బడుగులు, బహుజనులదే

- 42 శాతం రిజర్వేషన్ జాగృతితోనే సాధ్యపడింది
- రాష్ట్రంలో.. బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీల ఐక్యత అవసరం
- జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షులు కొట్టాల యాదగిరి ముదిరాజ్

**జయభేరి, గజ్వేల్, ఆగస్టు 04 :**



రాబోవు కాలమంతా బడుగులు, బహుజనులదే రాజ్యమని, అలాగే రాష్ట్రంలో బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీల ఐక్యత ఎంతో అవసరమని రాష్ట్ర జాగృతి ఉపాధ్యక్షులు కొట్టాల యాదగిరి ముదిరాజ్ పేర్కొన్నారు. జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియామకం పొందిన అనంతరం కల్వకుంట్ల కవితను కలిసి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో 60 శాతం ఉన్న బీసీల్లో ఐక్యత లోపించిన కారణంగానే రాజ్యాధికారానికి దూరం అవుతుండగా, వారిని చైతన్యం చేస్తూ సంఘటిత పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ముఖ్యంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు సత్తా చాటాలని, ఇందుకు జాగృతి సంపూర్ణ సహకారం అందిస్తుందని తెలిపారు. ముఖ్యంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ దక్కుతుండడాన్ని కొన్ని పార్టీలు జీర్ణించుకోలేకపోతుండగా, అన్ని పార్టీల్లోని బడుగు బలహీన వర్గాలు అధిష్టానాలను ఒప్పించేందుకు కృషి కోరారు. అయితే కామారెడ్డి డిక్లరేషన్ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని, కోర్టులో అడ్డుకోవాలని చూస్తున్న వారికి తగిన రీతిలో జవాబు చెప్పాలని తెలిపారు. కొన్ని రాష్ట్రాల్లో ఇప్పటికే 50 శాతానికి మించి రిజర్వేషన్లు అమలవుతుండగా, తెలంగాణ రాష్ట్రంలో మాత్రం అందుకు భిన్నంగా కొన్ని పార్టీలు వ్యవహరిస్తూ తమ అనుచరులను కోర్టులో కేసులు వేయించినట్లు గుర్తు చేశారు. కాగా తమకు న్యాయ స్థానాలపై పూర్తి నమ్మకం ఉందని స్పష్టం చేస్తూ వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి జాగృతిని పటిష్టం చేసి సత్తా చాటుతామని అన్నారు. పేద బడుగు బలహీన వర్గాల పక్షాన పోరాటం చేస్తున్న కవితకు అన్ని వర్గాల నుండి సంపూర్ణ మద్దతు వస్తుండగా, రాష్ట్రంలో జాగృతి, కాంగ్రెస్, బిజెపి మినహా ఇతర పార్టీలు అంతర్ధానం అవుతాయని వివరించారు.



## స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ, ఎస్సీలకు రిజర్వేషన్లు కల్పించాలి

**జయభేరి, గార్ల, అక్టోబర్ 4:**

మహబూబాబాద్ జిల్లా పరిధిలోని ఏజెన్సీ మండలమైన గార్లలో గతంలో మాదిరిగా బీసీలు,ఎస్సీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంపీటీసీ,వార్డు స్థానాల్లో పోటీ చేయుటకు రిజర్వేషన్లు కల్పించాలని వామపక్ష పార్టీలు,ప్రజాసంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎంపీడీవో మంగమ్మకు అందజేశారు.అనంతరం వామపక్ష పార్టీలు,ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ, గత ఎన్నికల్లో బీసీలు, ఎస్సీ అభ్యర్థులకు రిజర్వేషన్ ఇవ్వబడిందని, తాజా నోటిఫికేషన్ ప్రకారం బీసీలు, ఎస్సీ అభ్యర్థులకు ప్రత్యేక రిజర్వేషన్ ఇవ్వలేదని మొత్తం 50 శాతం సీట్లు అన్ రిజర్వ్డ్ గా (సాధారణ ) గా ప్రకటించబడ్డాయని తెలిపారు.గత ఎన్నికల విధానాన్ని పునరుద్ధరించి బీసీ, ఎస్సీ అభ్యర్థులకు రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు విశ్వ జంపాల, కందునూరి శ్రీనివాస్, కట్టెబోయిన శ్రీనివాస్, పానుగంటి రాధాకృష్ణ,తోడేటి శ్రీను గౌడ్, కందునూరి ఈశ్వర్ లింగం, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పొన్నంపై అంజన్ ఆగ్రహం



**జయభేరి, హైదరాబాద్, అక్టోబరు 4:**

తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్‌పై సొంత పార్టీ నేత, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నేపథ్యంలో టిక్కెట్ కోసం కాంగ్రెస్ పార్టీలో నాయకుల మధ్య విభేదాలు వెలుగుచూస్తున్నాయి. జూబ్లీహిల్స్ టిక్కెట్ కోసం అంజన్ కుమార్ యాదవ్ ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు, హైదరాబాద్ ఇన్‌ఛార్జ్ మంత్రిగా పొన్నం ప్రభాకర్ ఉన్నారు.ఉప ఎన్నికల్లో స్థానికులకు అవకాశం ఉంటుందని, బయటి నుంచి దిగుమతి ఉండదని పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలపై అంజన్ కుమార్ యాదవ్ స్పందించారు. పార్టీలో పొన్నం ప్రభాకర్ కంటే తాను సీనియర్ నాయకుడినని చెప్పారు. జూబ్లీహిల్స్ టిక్కెట్ ఎవరికి అనేది అధిష్ఠానం నిర్ణయిస్తుందని, పొన్నం ప్రభాకర్ కాదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీలో ఒకే కుటుంబం నుంచి ఒకరికి మించి ప్రజాప్రతినిధులుగా ఉన్నారని కూడా ఆయన గుర్తు చేశారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఆయన భార్య పద్మావతి, కోమటిరెడ్డి సోదరులు, మల్లు భట్టి విక్రమార్క, ఆయన అన్న మల్లు రవి, వివేక్ కుటుంబంలో ఆయన మంత్రిగా ఉంటే కొడుకు ఎంపీగా, సోదరుడు ఎమ్మెల్యేగా ఉన్నారని గుర్తు చేశారు. తన కుమారుడు ఎంపీగా ఉన్నంత మాత్రాన తనకు ఎమ్మెల్యే టిక్కెట్ ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు.బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ హైదరాబాద్‌లో బీఆర్ఎస్ పార్టీ బలంగా ఉండాలని మహమూద్ అలీకి ఎమ్మెల్సీ ఇచ్చి ఉప ముఖ్యమంత్రిని, హోంమంత్రిని చేశారని గుర్తు చేశారు. నాయిని నర్సింహారెడ్డికి ఎమ్మెల్సీ ఇచ్చి హోంమంత్రిని చేశారని అంజన్ కుమార్ యాదవ్ గుర్తు చేశారు.

## వ్యక్తిగత విషయాలను పార్టీకి పూయడం తీవ్రంగా ఖండిస్తున్నాం

- బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు దస్రునాయక్

**జయభేరి, కొండమల్లేపల్లి :**



కొండమల్లేపల్లి వ్యక్తిగత విషయాలని పార్టీకి మచ్చ వచ్చే విధంగా ప్రముఖ పత్రికలలో రాసిన వార్తను తీవ్రంగా ఖండిస్తున్నామని కొండమల్లేపల్లి బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దసురు నాయక్ అన్నారు. కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని పాల కేంద్రంలో శనివారం రోజు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీకి మచ్చ తెచ్చేవారు ఎంతటి వారైనా సరే వారిని ఉపేక్షించేది లేదని ఆయన తెలిపారు. శనివారం రోజు ఆంధ్రప్రభ పత్రికలో ప్రచురితమైన బిఆర్ఎస్ పార్టీ నాయకుడిని చితక బాధారని వార్త రావడంతో అధిక వడ్డీలతో ప్రజలను మోసం చేస్తే, వారిని పార్టీ సస్పెండ్ చేస్తుందని తప్పు చేస్తే కన్న కూతురునే కెసిఆర్ పార్టీ నుండి సస్పెండ్ చేసిందని గుర్తు చేశారు. పార్టీ సిద్ధాంతాలకు ప్రతి ఒక్కరు కట్టుబడి ఉండాలని,వాస్తవానికి ఆ వార్త రాసిన వ్యక్తికి పార్టీలో ఎలాంటి బాధ్యత లేకుండా కూడా పార్టీకి కావాలని కొందరు మచ్చ తెచ్చే విధంగా పార్టీని బధనం చేయాలని చూస్తే సహించేది లేదని ఆయన తెలిపారు. ఒకవేళ మండలానికి చెందిన నాయకుడు నిజంగానే అధిక వడ్డీకి ప్రజలను మోసం చేసినట్లు నిర్ధారణ అయితే పార్టీ నుండి వెంటనే అధినేతత్వంతో కలిసి చర్చించి సస్పెండ్ చేస్తామని అప్పటిదాకా ఆయన పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటాడని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకులు రామావత్ రమేష్ నాయక్, మాజీ సర్పంచులు మాజీ ఎంపిటిసిలు, కోర్ర కోటేష్ నాయక్, హరికృష్ణ, వెంకటేష్, నాని తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా అమ్మవారి నిమజ్జనోత్సవం

**జయభేరి, తుర్కపల్లి, అక్టోబర్ 04 :**



తుర్కపల్లి మండల కేంద్రంలోని అంగడి బజార్ లో శ్రీ భవానీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెలకొల్పిన దుర్గామాత అమ్మవారిని శనివారం అంగరంగ వైభవంగా నిమజ్జనోత్సవాన్ని నిర్వహించారు. అమ్మవారి నిమజ్జనం సందర్భంగా నిర్వహించిన చీరల వేలం పాటలో అమ్మవారి చీరలను దక్కించుకున్నారు.

దసరా నవరాత్రుల్లో దుర్గామాత అమ్మవారు రోజుకు ఒక్క అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. అట్టి పూజలు అందుకున్న అమ్మవారి చీర తమకు దక్కడం తమ అదృష్టమని దక్కించుకున్న వారు సంతోషాన్ని వ్యక్తం చేశారు. శనివారం మధ్యాహ్నం దుర్గామాత నిమజ్జన శోభాయాత్రను నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, శ్రీ భవాని యూత్ అసోసియేషన్ సభ్యులు ఆకుల సాయిరాం, పాముల బాలకృష్ణ, కళాశికం నితీష్, ఏలగల సాయి నవీన్, ఆకుల వినయ్, బొల్లారం రంజిత్, కళాసికం జగదీష్, తలారి సాయి, కావలి నవీన్, డొంకెన వంశీ ,ఎలగల భాను, తునికి తరుణ్, ఆకుల దుర్గాప్రసాద్, తునికి శర్వానంద్, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.








## శ్రీ సాయి సన్నిధి దర్శనానికి విచ్చేసిన సుప్రీంకోర్టు రిటైర్డ్ చీఫ్ జస్టిస్ ఎన్వి రమణ

**జయభేరి, చింతపల్లి :**

చింతపల్లి శ్రీ షిరిడి సాయిబాబా దేవాలయం శ్రీ సాయి సన్నిధి దర్శనానికి విచ్చేసిన సుప్రీంకోర్టు రిటైర్డ్ చీఫ్ జస్టిస్ ఎన్వి రమణ బాబాని దర్శించుకోవడం జరిగింది వారికి ఆలయపండితులు వేదమంత్రాలతో వేద ఆశీర్వచనం చేయడం జరిగింది అనంతరం వారు మాట్లాడుతూ చింతపల్లి సాయిబాబాను దర్శించుకోవడం చాలా గొప్ప అనుభూతి కలిగినది. ఈ సంస్థానం చాలా అద్భుతంగా నిర్వహిస్తున్నారని ఆలయ ధర్మకర్తలను అభినందించడం జరిగినది.

## వైభవంగా శ్రీవాసవి మాత శోభాయాత్ర



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం అమ్మవారిని ఈరోజు ఆలయ కమిటీ వారు శోభాయాత్రను నిర్వహించినారు శోభయాత్రలో మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించినారు. శోభయాత్రలో చెక్కభజన కోలాటాలు నుత్యాలు మంగళ వాయిద్యాల మధ్యలో అమ్మవారి శోభాయాత్రను ఆర్యవైశ్యులు అంగరంగ వైభవంగా నల్లగొండ జిల్లాలోనే ఎక్కడ లేని విధంగా శోభయాత్రను నిర్వహించినారు పెద్ద లడ్డు 5 11 116 చిన్న లడ్డు 4 11 116 కలుశం 3 33 333 వేలంపాటలో దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నరసింహ, గౌరవ అధ్యక్షులు పానగంటి మల్లయ్య, అధ్యక్షులు చీదెళ్ల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి సముద్రాల ప్రభాకర్, కోశాధికారి కొత్త సుబ్బారావు ఆర్యవైశ్య సంఘం సభ్యులు, ఆర్యవైశ్య మహిళా సంఘం సభ్యురాలు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రథమ బహుమతి అందించిన వడ్త్య రమేష్ నాయక్



**జయభేరి, చందంపేట :**

చందంపేట మండలం కాట్రావత్ తండ కొర్ర తండ లో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ లో గెలుపు పొందిన జట్టు ప్రథమ బహుమతిని BRS దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్య రమేష్ నాయక్ అందజేశారు జట్టుకు డ్రెస్ ను స్పాన్సర్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మేనేజ్మెంట్ సభ్యులు పాల్గొన్నారు.

## లక్కీ డ్రాలో అమ్మవారి చీరను గెలుపొందిన నీల సుమన్



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ లోని బాల్ థాక్రే యూత్ దుర్గామాత దగ్గర లక్కీ డ్రాలో అమ్మవారి చీరను నీల సుమన్ గెలుపొందడం జరిగింది ఆ అమ్మవారి అనుగ్రహం ఎల్లప్పుడూ దేవరకొండ అందరి పై అమ్మవారి ఆశీర్వాదాలు ఉండి సుఖ సంతోషాలతో అందరం ఉండాలని కోరుకుంటున్నాను అని నీల సుమన్ తెలియజేసినారు.

## దివ్యాంగులకు అండగా బీసీ సంఘం



**జయభేరి, వెంకటాపురం, అక్టోబరు 4 :**

వెంకటాపురం మండలంలోని వీరభద్రవరం గ్రామానికి చెందిన దివ్యాంగురాలు మాటూరి రమణ గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో ఆర్థికంగా సతమతమవుతోంది. విషయం తెలుసుకున్న జాతీయ బీసీ సంక్షేమ సంఘం ములుగు జిల్లా ఉపాధ్యక్షులు మంచెర్ల నాగేశ్వరరావు, వెంకటాపురం మండలం కార్యదర్శి బట్ట నాగేందర్ నిరుపేద కుటుంబాన్ని పరామర్శించి ఆరోగ్య ఖర్చుల నిమిత్తం 3000 రూపాయల నగదు తో పాటు, 25 కేజీల బియ్యం బస్తా అందజేసి మానవత్వం చాటుకున్నారు. కాగా ఆపదలో ఆపన హస్త అందించిన దాతలకు బాధితురాలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు యూత్ సభ్యులు సోలం సుధాకర్, సోలం ఓంపతి, పోడం సురేష్, బంద రాము, గగ్గురి రమేష్, బట్ట నారాయణ, పొనగంటి కృష్ణారావు, దర్రాజు గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.




# నేషనల్ క్రష్ రశ్మిక మందన్న "ది గర్ల్ ఫ్రెండ్" సినిమా..

నేషనల్ క్రష్ రశ్మిక మందన్న, టాలెంటెడ్ హీరో దీక్షిత్ శెట్టి జంటగా నటిస్తున్న సినిమా "ది గర్ల్ ఫ్రెండ్". ఈ సినిమాను ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్ మెంట్ బ్యానర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. బ్యూటిఫుల్ లవ్ స్టోరీతో దర్శకుడు రాహుల్ రవీంద్రన్ రూపొందిస్తున్నారు. ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మాతలుగా వ్యవహిస్తున్నారు. ఈ రోజు ఓ స్పెషల్ వీడియోతో "ది గర్ల్ ఫ్రెండ్" సినిమా రిలీజ్ డేట్ ను మేకర్స్ అనౌన్స్ చేశారు. నవంబర్ 7న ఈ చిత్రాన్ని హిందీతో పాటు తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు. 'ప్రేమికులుగా మనం ఒకే టైపా, ఒకరికొకరం ఎంతవరకు కరెక్ట్ ?, రకరకాల కారణాలతో కలిసే ప్రేమికుల్లో ఎంతమందికి ఈ క్లారిటీ ఉంటుంది ?. మీకు ఉందా ?, నవంబర్ 7న థియేటర్స్ కు రండి డిస్కస్ చేద్దాం..' అంటూ ప్రేక్షకుల్ని రశ్మిక, దీక్షిత్ ఇన్వైట్ చేస్తున్న రిలీజ్ డేట్ అనౌన్స్ మెంట్ వీడియో ఇన్నోవేటివ్ గా ఉండి ఆకట్టుకుంటోంది. నటీనటులు రశ్మిక మందన్న, దీక్షిత్ శెట్టి, తదితరులు.

# భర్త మహాశయులకు విజ్ఞప్తి?



రిలీజ్‌కు రెడీగా ఓ సినిమా.. నిర్మాణంలో ఓ సినిమా.. ఈ పంథాలో ముందుకు పోతూవుంటారు అగ్ర హీరో రవితేజ. ఆయన నటించిన 'మాస్ జాతర' సినిమా ఈ నెల 31న విడుదల కానుంది. అలాగే, కిశోర్ తిరుమల దర్శకత్వంలో నటిస్తున్న సినిమా ప్రస్తుతం నిర్మాణ దశలో ఉంది. వచ్చే ఏడాది సంక్రాంతికి ఈ సినిమాను విడుదల చేయాలనే తలంపుతో శరవేగంగా చిత్రీకరణ జరుపుతున్నారు దర్శకుడు కిశోర్ తిరుమల. ఇందులో కేతిక శర్మ, అషికా రంగనాథ్ కథానాయికలు.

# దసరా సర్‌ప్రైజ్ ఇచ్చిన సామ్..



స్టార్ హీరోయిన్ సమంత ఇటీవల తన సోషల్ మీడియాలో ఒక ఆసక్తికర పోస్ట్ చేశారు. "కొత్త ప్రయాణం" అంటూ ఆమె పోస్ట్ చేసిన ఫోటో అభిమానులలో ఆసక్తిని పెంచింది. ఈ పోస్ట్, కొంతకాలంగా ఆమె రెండో పెళ్లి చేసుకోబోతున్నారనే వార్తల నేపథ్యంలో మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. సమంత తన కొత్త ఇంట్లోకి అడుగుపెట్టారు. ఈ సందర్భంగా ఇంటి గోడపై తన పేరులోని మొదటి అక్షరాలు సామ్ అని డిజైన్ చేయించిన లోగో ఫోటోను ఆమె పంచుకున్నారు. అయితే, ఈ ఇల్లు హైదరాబాద్ లో ఉందా లేక ముంబైలోనా అనే విషయంపై స్పష్టత లేదు.

# ప్రభాస్‌కు మరదలిగా.. బన్నీకి వదినగా..



చంద్ర శేఖర్ ఏలేటి దర్శకత్వంలో తెరకెక్కిన ఐతే సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది సింధు తులాని. ఈ సినిమా సూపర్ హిట్ గా నిలిచింది. సింధు అందం, అభినయానికి మంచి మార్కులు పడ్డాయి. దీని తర్వాత కల్యాణ్ రామ్ అతనొక్కడే సినిమాతో మరో బ్లాక్ బస్టర్ మూవీని ఖాతాలో వేసుకుందీ అందాల తార. అలాగే నవదీప్ తో చేసిన గౌతమ్ ఎస్ఎస్‌సీ సినిమా కూడా సింధుకు మంచి పేరు తెచ్చిపెట్టింది. ఇదే క్రమంలో ప్రభాస్ నటించిన పౌర్ణమి సినిమాలో డార్లింగ్ కు మరదలిగా నటించిందీ అందాల తార. ఈ మూవీలో ఆమె కనిపించేది ఒకటి, రెండు సీన్లలోనే అయినా స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచింది. హీరోయిన్ గా అవకాశాలు తగ్గిన తర్వాత సహాయక నటిగా, సపోర్టింగ్ ఆర్టిస్టుగా పలు సినిమాల్లో నటించింది సింధు తులాని. అలా అల్లు అర్జున్ నటించిన సన్నాఫ్ సత్య మూర్తి సినిమాలోనూ ఓ కీలక పాత్ర పోషించింది. ఈ సినిమాలో ఆమె వెన్నెల కిషోర్ భార్యగా, అల్లు అర్జున్‌కు వదినగా నటించింది. అలాగే ఇష్క్ సినిమాలో హీరో నితిన్ కు అక్కగానూ యాక్ట్ చేసింది. కాగా చివరిగా సింధు తులాని.. అంజలి హీరోయిన్‌గా నటించిన హార్రర్ సినిమా చిత్రాంగధలో నటించింది. ఆ తర్వాత ఆమె మరో సినిమా చేయలేదు. సింధు.. చేతన్ అనే సాఫ్ట్ వేర్ ఇంజనీర్‌ను పెళ్లి చేసుకుంది. వీళ్లకు శ్వేత అనే కుమార్తె ఉంది. ప్రస్తుతం సింధు సినిమాలకు దూరంగా ముంబైలో ఉంటోందని తెలుస్తోంది.

# ఎంత పనిచేశావ్ అమ్మడు!

## 'కాంతారా 2' లో హీరోయిన్ రోల్ రిజెక్ట్ చేసిన టాలీవుడ్ బ్యూటీ ఎవరో తెలుసా?



దసరా కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన కాంతారా ఛాప్టర్ 1 బ్లాక్ బస్టర్ టాక్ తో దూసుకెళుతోంది. బరిలో ధనుష్ సినిమా ఉన్నా అంచనాలకు మించి కలెక్షన్లు రాబడుతోది. మొదటి రోజు ప్రపంచవ్యాప్తంగా 89 కోట్ల రూపాయిల గ్రాస్ వసూళ్లను రాబట్టిన ఈ చిత్రం మొత్తం రెండు రోజుల్లో మొత్తం రూ.105.5 కోట్లు రాబట్టినట్లు ట్రేడ్ నిపుణులు చెబుతున్నారు. కన్నడతో పాటు రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఈ సినిమాకు భారీ కలెక్షన్లు వస్తున్నాయి. సుమారు మూడేళ్ల క్రితం వచ్చిన కాంతారకు ప్రీక్వెల్ గా కాంతారా ఛాప్టర్ 1 తెరకెక్కింది. మొదటి పార్ట్ ను తెరకెక్కించిన రిషభ్ శెట్టినే ఈ మూవీకి దర్శకత్వం వహించాడు. అంతేకాదు మెయిన్ లీడ్ లో కూడా నటించాడు. ఇక ఈ మూవీలో హీరో రిషభ్ తర్వాత చెప్పుకోవాల్సింది హీరోయిన్ రుక్మిణీ వసంత్ రోల్ గురించి. ఇందులో ఆమె పోషించిన రాణి కనకవతి పాత్రకు మంచి రెస్పాన్స్ వస్తోంది. సినిమా రిలీజ్ కు ముందు రుక్మిణీ రోల్ గురించి పెద్దగా ఎలాంటి అప్ డేట్స్ రాలేదు. జస్ట్ ఆమె పాత్ర, లుక్ కు సంబంధించి పోస్టర్స్ మాత్రమే రిలీజ్ చేశారు. కానీ కాంతార 2లో రుక్మిణీ రోల్ ను పవర్ ఫుల్ గా తీర్చిదిద్దాడు రిషభ్ శెట్టి. ముఖ్యంగా క్లైమాక్స్ లో వచ్చే ట్విస్ట్ ను చూసి ఆడియెన్స్ ఆశ్చర్యపోతున్నారు. కాంతార 2 సినిమాలో రుక్మిణీ దాదాపు మెయిన్ విలన్ రోల్ ను పోషించింది. క్లైమాక్స్ లో ఆమె హీరోతో పోరాటం చేసే దృశ్యాలు సినిమాకు హైలెట్ గా నిలిచాయి. మొత్తానికి కాంతార 2తో రుక్మిణీ ఖాతాలో ఎట్టకేలకు ఒక బ్లాక్ బస్టర్ మూవీ చేరింది. అయితే రుక్మిణీ కంటే హీరోయిన్ రోల్ కోసం చాలా మందిని సంప్రదించాడట రిషభ్ శెట్టి. ఆడిషన్స్ కూడ చేశాడట. అందులో మన టాలీవుడ్ లో నెంబర్ వన్ హీరోయిన్ గా కొనసాగుతోన్న శ్రీలీల కూడా ఉందట. అయితే సినిమాలో హీరోయిన్ ది నెగెటివ్ రోల్ కావడంతో శ్రీలీల తిరస్కరించిందట. ఇందులో ఎంత నిజముందో తెలియదు కానీ ఒకవేళ కాంతార 2లో హీరోయిన్ రోల్ చేసి ఉంటే శ్రీలీల కెరీర్ కు చాలా ప్లస్ అయ్యేదేమో!

కాంతార 2 సినిమాలో రుక్మిణీ వసంత్..

శ్రీలీల ఖాతాలో ఇప్పటికే చాలా బ్లాక్ బస్టర్ సినిమాలు ఉన్నాయి. అందం, అభినయం పరంగా మంచి మార్కులే పడుతున్నాయి ఈ అందాల తారకు. అయితే ఇప్పటివరకు ఎక్కువగా గ్లామర్ రోల్స్ లోనే కనిపించింది శ్రీలీల. కానీ కాంతార 2 లాంటి యాక్టింగ్ కు స్కోప్ ఉన్న పాత్రలు పడితేనే శ్రీలీలకు సినిమాల్లో లాంగ్ కెరీర్ ఉంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314.** email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**